'గురుకుల' భర్తీ గందరగోళం

మొదటిపేజీ తరువాయి...

ప్రారంభించింది. ఏమాత్రం ప్రణాళిక లేకుండా ఒక్క రోజు ముందుగానే మెరిట్ జాబితా ప్రకటించి 1:2 నిష్పత్తిలో అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మొదలుపెట్టింది.

జేఎల్, డీఎల్ వదిలి నేరుగా పీజీటీ..!

రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ గురుకులాల్లో కలిపి మొత్తంగా 9 క్యాటగిరీల్లో పీజీటీ 1,276, టీజీటీ 4,020, జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్ 2,876, టీజీటీ స్కూల్ లైబ్రేరియన్ 434, స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ 275, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ 226, మ్యూజిక్ టీచర్ 124 పోస్టులు కలిపి మొత్తం 9,231 పోస్టుల భర్తీకి గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత ఆగస్టులో నిర్వహించిన రాత పరీక్షకు అన్ని పోస్టులకు కలిపి 6,52,413 మంది దరఖాస్తు చేసుకోగా 4,93,727 మంది పరీక్షకు హాజరయ్యారు. జోనల్‌స్థాయి పోస్టులైన టీజీటీ, స్కూల్ పీడీ, లైబ్రేరియన్, ఆర్ట్‌అండ్‌క్రాఫ్ట్, మల్టీజోనల్ పోస్టులైన గురుకుల డీఎల్, జేఎల్, పీజీటీ అభ్యర్థుల నుంచి ఆప్షన్లను ట్రిబ్ స్వీకరించింది. వాటి ఆధారంగా ఆయా పోస్టుల వారీగా 1:2 నిష్పత్తిలో మెరిట్ జాబితాలను కూడా సిద్ధం చేసింది. అదే సమయంలో ఎన్నికల కోడ్ అడ్డురావడం, కోర్టు కేసుల నేపథ్యంలో నియామక ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ప్రస్తుతం మళ్లీ నియామక ప్రక్రియ ప్రారంభమైంది. తొలుత డిగ్రీ లెక్చరర్, ఆపై జేఎల్, పీజీటీ, టీజీటీకి సంబంధించిన పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. గురుకుల పోస్టులకు సంబంధించి అభ్యర్థులు తమ అర్హతలను బట్టి రెండుకంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు.



సేవాలాల్ బంజారాభవన్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు

పైస్థాయి నుంచి పోస్టులను భర్తీ చేయడం వల్ల మళ్లీ ఖాళీలు ఏర్పడే అవకాశం ఉండబోదని పలుమార్లు వెల్లడించింది. ఆ దిశగానే పోస్టుల భర్తీ ప్రక్రియకు సన్నాహాలు చేసింది. అందులో భాగంగా తొలుత గురుకుల డీఎల్ పోస్టులకు సంబంధించి అభ్యర్థుల మెరిట్ జాబితాను విడుదల చేసి, 1:2నిష్పత్తిలో అభ్యర్థులను డెమోకు పిలవాలని నిర్ణయించి ఏర్పాట్లు కూడా చేసుకున్నది. ఇప్పుడేమో అందుకు విరుద్ధంగా నేరుగా పీజీటీ, ఫిజికల్ డైరెక్టర్ అభ్యర్థుల ఎంపికకు ఉపక్రమించింది. అందుకు సంబంధించి అభ్యర్థుల మెరిట్ జాబితాను విడుదల చేసి సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టింది.

ఒకే రోజు అన్ని సబ్జెక్టులకు..

పీజీటీకి సంబంధించి ట్రిబ్ ఎలాంటి ప్రణాళిక లేకుండా ఒక్కరోజునే దాదాపు అన్ని సబ్జెక్టుల అభ్యర్థులను సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలిచారు. మొత్తంగా 1276 పోస్టులకు గాను 1:2 పద్ధతిలో 2500మందికిపైగా అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు పిలిచారు. బంజారాహిల్స్‌లోని కుమ్రంభీం ఆదివాసీభవన్‌లో తెలుగు, ఇంగ్లిష్, ఫిజికల్‌సైన్స్, పక్కనే ఉన్న బంజారాభవన్‌లో మ్యాథమెటిక్స్, బయోలాజికల్ సైన్స్, సోషల్‌సైన్స్ సబ్జెక్టుల అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. అభ్యర్థులు తొలుత క్యాస్ట్ వెరిఫికేషన్ నిర్వహించుకుని, బయోమెట్రిక్ తీసుకుని, ఆ తరువాత సర్టిఫికెట్ వెరిఫికేషన్, రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని, తిరిగి సర్టిఫికేషన్, బయోమెట్రిక్, క్యాంప్ కన్వీనర్ సంతకాలు చేయించుకుని, అక్నాలెడ్జ్‌మెంట్ తీసుకోవాలని వెల్లడించింది. కానీ ఎక్కడా క్రమపద్ధతి అన్నదే లేకుండా ఇష్టారాజ్యంగా నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం వరకు ఆ ప్రక్రియను ప్రారంభించలేదు. ఆ తరువాత ప్రారంభించినా అర్ధరాత్రి వరకు కొనసాగుతూనే ఉంది. చంటిపిల్లలతో వచ్చిన మహిళా అభ్యర్థులు ఇబ్బందులకు గురయ్యారు. రోజుకు ఒకటి రెండు సబ్జెక్టులకు సంబంధించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టకుండా ఒకేరోజున అన్ని సబ్జెక్టులకు నిర్వహించడంపై అభ్యర్థులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.

ప్రచారకాంక్ష కోసమేనా!

ప్రభుత్వ ఒత్తిడి మేరకు ట్రిబ్ ఆగమేఘాల మీద సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టినట్టు తెలుస్తున్నది. 14న పోలీసులు ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సీఎం రేవంత్ చేతుల మీదుగా నియామకపత్రాలు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పనిలోపనిగా ఇప్పటికే గురుకుల ఉపాధ్యాయ, లెక్చరర్ పోస్టులకు ఎంపికైన వారికి కూడా నియామక పత్రాలు అందివ్వాలని నిర్ణయించినట్టు సమాచారం. ఈ మేరకు సాధారణ పరిపాలనశాఖ నుంచి ట్రిబ్, టీఎస్ఎల్‌పీఆర్‌బీకి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ఒత్తిడి మేరకు ట్రిబ్ వెంటనే నియామక ప్రక్రియ చేపట్టినట్టు తెలుస్తున్నది. డీఎల్, జేఎల్ పోస్టులను భర్తీ చేయాలంటే ముందుగా ఆయా అభ్యర్థుల నుంచి డెమోలను స్వీకరించాల్సి ఉంది. దానికి సుదీర్ఘ సమయం పట్టే అవకాశం ఉండడంతో నేరుగా పీజీటీ పోస్టుల భర్తీకి ట్రిబ్ ఉపక్రమించింది. ప్రచారం కోసమే ప్రభుత్వం ఇలా ట్రిబ్‌ను పరుగులు పెట్టిస్తున్నదని అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ ఖాళీలు తప్పవా..!

ప్రస్తుతం పీజీటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు, రేపు జేఎల్, డీఎల్‌కు ఎంపికయ్యే అవకాశాలున్నాయి. అలాంటి సందర్భంలో పీజీటీ వదులుకుని చాలామంది అభ్యర్థులు జేఎల్, డీఎల్‌వైపు మొగ్గుచూపుతారు. అదే జరిగితే మళ్లీ పీజీటీ పోస్టులు భారీగా ఖాళీ అయ్యే అవకాశముంది. ముందుగా జేఎల్, డీఎల్ నియామకం చేపడితే, ఆ తరువాత పీజీటీ పోస్టులకు సంబంధించి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రావాల్సిన అవసరం ఉండబోదని, కానీ ఇప్పుడు మళ్లీ జేఎల్, డీఎల్ పోస్టులకు కూడా రావాల్సి ఉంటుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కరోజు ముందు మెసేజ్‌లు

సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం హాజరుకావాలంటూ అధికారులు ఒక్క రోజు ముందు అభ్యర్థులకు సందేశాలు పంపడం గందరగోళానికి కారణమైంది. గురుకుల జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలు, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ పోస్టులకు 9,10 తేదీల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను చేపట్టగా, వారికి 7న సాయంత్రం సందేశాలు పంపారు. తాజాగా పీజీటీ పోస్టులకు సంబంధించి 9వ తేదీ సాయంత్రం సందేశాలను పంపి 11వ తేదీ ఉదయమే సర్టిఫికెట్ వెరిఫికేషన్ హాజరుకావాలని ఆదేశించారు. ఒక్క రోజు కూడా పూర్తిగా సమయమివ్వకుండానే ఆగమేఘాల మీద ధ్రువపత్రాల పరిశీలన చేపట్టడంపై అభ్యర్థులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్హతలు, కులం, నాన్ క్రీమిలేయర్ తదితర సర్టిఫికెట్లతోపాటు, అటెస్టేషన్ ఫారమ్‌ను రెండు సెట్ల జిరాక్స్ తీసుకుని రావాలని కోరింది. చాలామంది అభ్యర్థులు సరైన అవగాహన లేక విద్యార్హతల సర్టిఫికెట్లతోనే వచ్చారు. ఇక్కడికి వచ్చాక అటెస్టేషన్ ఫారమ్‌పై గెజిటెడ్ ఆఫీసర్ సంతకం ఉండాలని అధికారులు చెప్పడంతో అభ్యర్థుల పడిన అవస్థలు అన్నీ ఇన్నీ కావు. అటెస్టేషన్ కోసం ఆదివారం హైదరాబాద్ రోడ్లపై అనేకమంది అభ్యర్థులు పరుగులు తీశారు.

ప్రాంతీయ భాషల్లో సీఏపీఎఫ్ పరీక్షలు

- తొలిసారిగా 13 భాషల్లో కానిస్టేబుల్ ఎగ్జామ్
- ఈ నెల 20 నుంచి మార్చి 7 వరకు నిర్వహణ
- ఫలించిన కేసీఆర్ పోరాటం
- 40 లక్షల మందికి ప్రయోజనం

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): దేశ చరిత్రలోనే తొలిసారిగా సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ (సీఏపీఎఫ్)లో కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) నియామక పరీక్షలను 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహించనున్నారు. ఇన్నాళ్లూ హిందీ, ఇంగ్లిషులో మాత్రమే నిర్వహిస్తుండటంతో ఆయా రాష్ట్రాల అభ్యర్థులకు కేంద్ర ప్రభుత్వ పోలీసు ఉద్యోగాల్లో తీవ్ర అన్యాయం జరిగేది. అన్ని రాష్ట్రాల నుంచి కేంద్రానికి వినతులు వెల్లువెత్తుండటంతో ప్రాంతీయ భాషల్లో పరీక్షల నిర్వహణకు ఆమోదం తెలిపింది. హిందీ, ఇంగ్లిషుతో పాటుగా 13 ప్రాంతీయ భాషల్లో సీఏపీఎఫ్ కానిస్టేబుల్ (జీడీ) పరీక్ష నిర్వహించాలని కేంద్ర హోంశాఖ ఆయా రాష్ట్రాలకు సమాచారం అందించింది. దేశంలో 128 నగరాల్లో ఈ నెల 20 నుంచి మార్చి 7 వరకు నిర్వహించే ఈ పరీక్షకు సుమారు 48 లక్షల మంది అభ్యర్థులు హాజరుకున్నారు. కేంద్రం నిర్ణయంతో హిందీ, ఇంగ్లిషుతోపాటు అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, మలయాళం, కన్నడ, తమిళం, తెలుగు, ఒడియా, ఉర్దూ, పంజాబీ, మణిపురి, కొంకణి భాషల్లో కానిస్టేబుల్ పరీక్ష ప్రశ్నపత్రాలు సిద్ధమయ్యాయి. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహిస్తున్న ముఖ్యమైన పరీక్షల్లో కానిస్టేబుల్ జనరల్ డ్యూటీ పరీక్ష ఒకటి.

'లింగ్విస్టిక్ ఈక్వాలిటీ'పై బీఆర్ఎస్ నిరసన

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు హిందీ, ఇంగ్లిష్‌ను ప్రామాణికం చేయడం వల్ల కోట్లాది మంది హిందీయేతర ప్రాంత నిరుద్యోగులు నష్టపోతున్నారని, తెలుగుతోపాటు రాజ్యాంగం గుర్తించిన అన్ని అధికారిక భాషల్లోనూ పరీక్షలు నిర్వహించాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాడు కేంద్రంపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి, లేఖలు సైతం రాశారు. నిరుడు ఏప్రిల్‌లో కేటీఆర్ సైతం కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు లేఖ రాశారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళంతోపాటు గుర్తించబడిన అన్ని అధికారిక భాషల్లో నిర్వహించాలని డిమాండ్ చేశారు. 'లింగ్విస్టిక్ ఈక్వాలిటీ' కావాలంటూ దక్షిణాదిలో నిరసనలు కొనసాగాయి. టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటాపాణి సహా పలువురు రాజకీయ విశ్లేషకులు, విద్యావేత్తలు గళం విప్పారు. 'బంగ్లా పోఖో' ప్రధాన కార్యదర్శి గార్గా ఛటర్జీ, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ఈ విషయంపై కేంద్రం స్పందించాలని విజ్ఞప్తి చేశారు. అన్ని భాషల్లోనూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు పరీక్షను నిర్వహించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చారు. దాంతో కేంద్రం దిగివచ్చింది. ప్రాంతీయ భాషల్లో పరీక్షల నిర్వహణకు అనుమతి ఇచ్చింది.

పదోన్నతులు ఇవ్వాల్సిందే

మొదటిపేజీ తరువాయి...

ప్రజాభవన్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వెయ్యికిపైగా ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, పీజీ కాలేజీలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ యాజమాన్యాల కింద కొనసాగుతున్నాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఇతర (జనరల్, బీసీ, మైనార్టీ) గురుకులాల్లో 2018, 2019లో ఉద్యోగంలో చేరిన వారికి కూడా పదోన్నతులు లభించాయి. అయితే ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లోని ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉద్యోగులకు చాలాకాలంగా ప్రమోషన్లు లభించలేదు. బదిలీలు చేపట్టకపోవడంతో ఏండ్ల తరబడి మారుమూల ప్రాంతాల్లోని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్నారు. కొత్తగా నియామకాలు పొందే వారు విధుల్లో చేరితే దీర్ఘకాలంగా మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్నవారు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న మెరుగైన ప్రాంతాలను కోల్పోనున్నారు. అంతేకాకుండా సుదీర్ఘ సర్వీస్ కలిగిన సీనియర్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉద్యోగులు రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా కొత్తగా నియామకం పొందనున్న వారికంటే జూనియర్‌గా పరిగణన పొందే ప్రమాదం ఉన్నది. దీనితోపాటు 317 జీవోకు సంబంధించిన సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. ఆయా సమస్యలను పరిష్కరించకుండా, ప్రమోషన్లు, బదిలీలు చేపట్టకుండా ప్రభుత్వం ఇప్పుడు ట్రిబ్ ద్వారా కొత్త నియామకాలు చేపట్టడంపై గురుకుల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

జేఏసీ ఏర్పాటు

ట్రిబ్ ద్వారా నియామకాలు చేపట్టడాన్ని నిరసిస్తూ, తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురుకులాల్లోని అన్ని సంఘాలు కలిసి ఇటీవల కార్యాచరణను ప్రకటించాయి. ఈ సమావేశానికి టిగారియా సెంట్రల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి నారాయణ, మధుసూదన్, స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీవీ కృష్ణారెడ్డి, ప్రభుదాస్, టీటీఆర్ఈఐటీఏ అధ్యక్ష, కార్యదర్శులు రుషికేశ్‌కుమార్, కల్యాణి, ట్రీస్ అధ్యక్ష, కార్యదర్శులు దామోదర్, సత్యం, ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేవీ చలపతి, వివేకానంద, టిగారియా డిగ్రీ కాలేజీ యూనిట్ బాధ్యులు శారద, సత్యశ్రీదేవి, ఎస్సీ సొసైటీ బాధ్యులు నర్సింలుగౌడ్, గణేశ్, టీ గురుకులం బాధ్యులు శ్యాంకుమార్, ముతయ్య, స్పెషల్ టీచర్స్ అధ్యక్షుడు వేదాంతచారి తదితరులు పాల్గొని ప్రభుత్వ గురుకుల ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీని ఏర్పాటు చేస్తున్నట్టు తీర్మానించారు. డిమాండ్ల పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. అందులో భాగంగా సోమవారం అన్ని పాఠశాలలు, కళాశాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని, మంగళవారం ఉదయం 6 గంటలకు జ్యోతిబా పూలే ప్రజాభవన్ వద్దకు గురుకుల ఉద్యోగ, ఉపాధ్యాయులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రాలు అందజేయాలని, అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే తదుపరి కార్యాచరణను అదేరోజు ప్రకటించాలని నిర్ణయించారు.

రిక్రూట్‌మెంట్‌కు ముందే పదోన్నతులు కల్పించాలి

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న అన్ని క్యాడర్ల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు కల్పించిన తరువాతే కొత్త రిక్రూట్‌మెంట్లు చేపట్టాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు, ప్రధాన కార్యదర్శి దయాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే డిమాండ్ల సాధనకు భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పదోన్నతులు కల్పించకుండా రిక్రూట్‌మెంట్‌ను చేపడితే సీనియర్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు.

పీఆర్సీ కమిటీకి వినతుల వెల్లువ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల వేతన సవరణకు ఏర్పాటైన పీఆర్సీ కమిటీకి వినతులు వెల్లువెత్తుతున్నాయి. సంఘాలు, వ్యక్తుల నుంచి పీఆర్సీ కమిటీ వినతులు, సూచనలు, ప్రతిపాదనలను ఆహ్వానించగా, ఆదివారం రోజే పలువురు పీఆర్సీ కమిటీకి ఈ మెయిల్ ద్వారా వినతులు సమర్పించారు. ముఖ్యంగా ఉపాధ్యాయుల నుంచి అధికంగా వినతులు అందాయి. మార్చి 4వ తేదీ వరకు కమిటీ వినతులను స్వీకరించనున్నది. ఆదివారం ఆన్‌లైన్‌లో వినతులు రాగా, సోమవారం నుంచి పలు సంఘాల నేతలు నేరుగా పీఆర్సీ కమిటీకి వినతిపత్రాలు అందజేయనున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసుకుంటున్నారు.

ప్రధాన ప్రతిపాదనలు ఇలా..

- మారుమూల ప్రాంతాల్లో ఉండేవారికి అదనపు హెచ్ఆర్ఏ లేదా అలవెన్స్ కల్పించాలి. తద్వారా ఆయా ప్రాంతాల్లో పనిచేసేందుకు ఉద్యోగులు ఆసక్తి చూపుతారు.
- జీహెచ్ఎంసీ ఫెరి-ఫెరి పరిధిని 25 కిలోమీటర్ల వరకు పెంచాలి.
- గురుకులాల్లో పీజీటీ, టీజీటీల మధ్య వేతన వ్యత్యాసం చాలా తక్కువగా ఉండగా, అదే ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్స్ మధ్య వేతన వ్యత్యాసం ఆకాశానికి భూమికి అందనంత ఉన్నది. దీనిని సరిచేయాలి. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్స్ బేసిక్‌పే వ్యత్యాసాన్ని తగ్గించాలి.
- డిప్లొమాతో ఉద్యోగం పొందిన ఏఈవో, స్టాఫ్‌నర్సు, లైబ్రేరియన్ల కంటే తక్కువగా ఎస్జీటీల వేతనాలున్నాయి. దీనిని సవరించాలి.
- సీపీఎస్‌ను రద్దుచేయాలని, పాత పింఛను అమలుచేయాలని 2004 తర్వాత ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన వారు కోరారు.

తెలంగాణకు మలేషియన్ యూనివర్సిటీ!

- ఏర్పాటుకు లింకన్ వర్సిటీ కాలేజీ ఆసక్తి
- యూజీసీ అనుమతి కోరుతూ దరఖాస్తు
- అనుమతిస్తే రాష్ట్రంలో తొలి విదేశీ వర్సిటీ

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): ఫార్మా, ఐటీ, పారిశ్రామిక రంగాల్లో జాతీయ అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షిస్తున్న తెలంగాణ తాజాగా అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను ఆకట్టుకుంటున్నది. పెట్టుబడుల ఖిల్లాగా మారిన తెలంగాణ విద్యాసుగంధాలు వెదజల్లే విదేశీ విశ్వవిద్యాలయాలను ఆహ్వానిస్తున్నది. ఈ క్రమంలో తెలంగాణలో తొలి విదేశీ వర్సిటీని స్థాపించేందుకు మలేషియన్ యూనివర్సిటీ ముందుకొచ్చింది. 'లింకన్ యూనివర్సిటీ కాలేజీ' తెలంగాణలో క్యాంపస్ ఏర్పాటు కోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)కి దరఖాస్తు చేసుకున్నది. ఇప్పటికే ఆస్ట్రేలియాకు చెందిన డీకిన్, వోలోంగాంగ్ విశ్వవిద్యాలయాలు గుజరాత్‌లో నెలకొల్పేందుకు ముందుకాగా, మూడో వర్సిటీగా లింకన్ వర్సిటీ కాలేజీ తెలంగాణను ఎంచుకున్నది. లింకన్ వర్సిటీ కాలేజ్‌ను 2011లో ప్రైవేట్ వర్సిటీగా స్థాపించారు. పైవ్‌స్టార్ ర్యాంకింగ్ పొందిన ఈ వర్సిటీ టాప్ వర్సిటీల్లో ఒకటిగా ఉన్నది.

గుజరాత్‌లో రెండు..

ప్రపంచ ప్రమాణాలతో కూడిన విదేశీ వర్సిటీలను దేశంలో నెలకొల్పుతామని కేంద్రం 2022-23 బడ్జెట్‌లో ప్రకటించింది. విదేశీ వర్సిటీల ఏర్పాటుకు యూజీసీ మార్గదర్శకాలను విడుదల చేసింది. జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ) సిఫార్సులకు అనుగుణంగా విదేశీ విద్యాసంస్థలు భారత్‌లో ప్రవేశించేందుకు యూజీసీ వీలుకల్పించింది. ఈ మార్గదర్శకాలను అనుసరించి దేశంలో విదేశీ వర్సిటీల ఏర్పాటు నోటిఫికేషన్ జారీచేసి, యూజీసీ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. ప్రత్యేకంగా యూజీసీ పోర్టల్‌ను తీసుకొచ్చింది. అంతర్జాతీయ ర్యాకింగ్స్‌లో టాప్- 500లో గల వర్సిటీలు భారత్‌లో వర్సిటీలను ఏర్పాటు చేసుకునే వీలుకల్పించగా, వీటిల్లో యూజీ, పీజీ, పీహెచ్‌డీ, సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులను నిర్వహించేందుకు యూజీసీ అనుమతిచ్చింది. మన దేశంలో ఒకటికి మించి క్యాంపస్‌ల ఏర్పాటుకు యూజీసీ అవకాశానిచ్చింది. ఆస్ట్రేలియాకు చెందిన రెండు వర్సిటీలు గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ సిటీ (గిఫ్ట్ సిటీ)లో ఏర్పాటుకు ముందుకు రాగా, ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్స్ అథారిటీ (ఐఎఫ్ఎస్సీఏ) సూత్రప్రాయంగా అంగీకరించింది. ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, ఫిన్‌టెక్, సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం వంటి కోర్సుల నిర్వహణకు ఈ రెండు వర్సిటీలు ముందుకొచ్చాయి.

నేడే జేఈఈ మెయిన్ -1 ఫలితాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): ఐఐటీలు, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ మెయిన్ -1 ఫలితాలు సోమవారం విడుదలకానున్నాయి. ఈ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ప్రకటించనున్నది. ఇప్పటికే జేఈఈ సెషన్ -1 ప్రాథమిక కీని విడుదల చేసి విద్యార్థుల నుంచి అభ్యంతరాలను స్వీకరించింది. సోమవారం ఫలితాలతోపాటు తుది కీని సైతం ఎన్టీఏ విడుదల చేయనున్నది. దేశవ్యాప్తంగా జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు జేఈఈ మెయిన్ -1 పరీక్షలు జరిగాయి. పేపర్ -1కు 12, 21,615 మంది దరఖాస్తు చేసుకోగా, 11,70,036 (95.8 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారు. ఎన్ఐటీల్లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (బీఆర్క్), బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ (బీ ప్లానింగ్) వంటి సీట్ల భర్తీకి జనవరి 24న నిర్వహించిన పేపర్-2 పరీక్షకు 74,002 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 55,493 (75శాతం) మంది పరీక్షకు హాజరయ్యారు. ఈ ఫలితాల కోసం https://jeemain.nta.ac.inను సంప్రదించాలని ఎన్టీఏ సూచించింది.

ముగిసిన గురుకుల ప్రవేశ పరీక్ష

93.97 శాతం మంది విద్యార్థుల హాజరు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): ఎస్సీ, ఎస్టీ, బీసీ, రెసిడెన్షియల్ గురుకులాల్లో 2024-25 విద్యాసంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తంగా 643 గురుకులాల్లో 51,924 సీట్లు అందుబాటులో ఉండగా, ప్రవేశపరీక్ష కోసం 1,20,654మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ సెక్రటరీ, వీటీజీ సెట్ కన్వీనర్ సీతాలక్ష్మి ఒక ప్రకటనలో వెల్లడించారు. వీరికి రాష్ట్రవ్యాప్తంగా 338 సెంటర్లలో ప్రవేశపరీక్ష నిర్వహించగా, 1,13,383 (93.97 శాతం) మంది హాజరైనట్టు వివరించారు.

20 నుంచి బీజేపీ బస్సు యాత్రలు

ఐదు రూట్లలో 10 రోజులపాటు నిర్వహణ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్రంలో ఈ నెల 20వ తేదీ నుంచి బస్సుయాత్రలు ప్రారంభించనున్నట్టు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తెలిపారు. 'విజయ సంకల్ప యాత్ర' పేరుతో మార్చి 1 వరకు యాత్ర కొనసాగుతుందని చెప్పారు. ఆదివారం యాత్ర పోస్టర్‌ను బీజేపీ రాష్ట్రకార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే దేశ ప్రజల్లో స్పష్టమైన ఆలోచన కనబడుతున్నదని, మరోసారి బీజేపీ సర్కారు రావాలి.. మూడోసారి మోదీ ప్రధాని కావాలని ప్రజలు నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులు తీసుకోవడానికి రాష్ట్ర శాఖ ఐదు రూట్లలో బస్సు యాత్రలు నిర్వహించాలని నిర్ణయించిందని, ఈ యాత్ర ఐదు ప్రాంతాల్లో ప్రారంభమవుతుందని వివరించారు. ఈ యాత్ర రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో, మండలాల్లో కొనసాగుతుందని చెప్పారు. ప్రతి మండల కేంద్రంలో, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో, జిల్లా కేంద్రాల్లో రోడ్ షోలు ఉంటాయని వెల్లడించారు. ముగింపులో ఈ ఐదు యాత్రలు హైదరాబాద్‌లో కలుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధులు ఎన్వీ సుభాష్, రాణి రుద్రమ తదితరులు పాల్గొన్నారు.

యాత్ర పేరు	పార్లమెంట్ నియోజకవర్గాలు
కుమ్రంభీం యాత్ర	ఆదిలాబాద్, పెద్దపల్లి, నిజామాబాద్
శాతవాహన యాత్ర	కరీంనగర్, మెదక్, జహీరాబాద్, చేవెళ్ల
కాకతీయ యాత్ర	ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్
భాగ్యనగర యాత్ర	భువనగిరి, హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి
కృష్ణమ్మ యాత్ర	మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్లగొండ

మూడేండ్లు పూర్తిచేసుకున్న ఎంపీడీవోల బదిలీ

హైదరాబాద్,